జాబ్ క్యాలెండర్ చిత్తుకాగితం

- బోగస్.. బోగస్.. కాంగ్రెస్ బోగస్
- బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో దద్దరిల్లిన అసెంబ్లీ
- యువతను సర్కారు మోసం చేసిందని ఆగ్రహం
- ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలపై మండిపాటు
- శాసనసభ నుంచి వాకౌట్.. గన్‌పార్కు వద్ద నిరసన
- నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కెళ్లిన పోలీసులు

గన్‌పార్క్ వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగులను కాంగ్రెస్ నిలువునా ముంచిందని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని ఊదరగొట్టి చిత్తు కాగితాలను అసెంబ్లీ ముందుంచిందని ధ్వజమెత్తింది. 'బోగస్ బోగస్..కాంగ్రెస్ బోగస్' అని పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసన తెలిపింది. సర్కారు ప్రకటించింది జాబ్ లెస్ క్యాలెండర్ అంటూ తూర్పారబట్టింది. నిరసనగా అసెంబ్లీ నుంచి గన్‌పార్క్‌లోని అమవీరుల స్తూపం వరకు ర్యాలీ తీసింది. నిరుద్యోగులకు అండగా నిలబడతామని స్పష్టం చేసింది. నిరుద్యోగులకు సర్కారు ఇచ్చిన మాట నిలబెట్టుకునేదాకా వెంటపడతామని హెచ్చరించింది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఆయనను సభనుంచి బహిష్కరించాలని డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఏ అభ్యర్థనూ స్పీకర్ పరిగణనలోకి తీసుకోకపోవడంతో సభ నుంచి వాకౌట్ చేసింది.

సభలో జరిగింది ఇదీ..

శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేసిన వెంటనే దానిపై చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో కేవలం ప్రకటన మాత్రమే చేస్తారా? చర్చ అవసరం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, జాబ్ క్యాలెండర్‌లో కనీసం రెండు ఉద్యోగాల సంఖ్య కూడా చూపలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో భట్టి విక్రమార్క స్పందిస్తూ సభలో ప్రకటించే స్టేట్‌మెంట్లకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని, చర్చకు కూడా ఆస్కారం లేదని, సభావ్యవహారాల నియామవళిని చదివి వినిపించారు. లక్షలాది మంది నిరుద్యోగులకు సంబంధించిన అంతపెద్ద అంశాన్ని ఒక్క మాటలోనే తేల్చేస్తారా? అని కేటీఆర్ మండిపడ్డారు. అయినా మారుమాట్లాడకుండానే సభ నుంచి భట్టి వెళ్లిపోయారు. ఆయన వెళ్తుండగా 'ఇస్తామన్న 2 లక్షల ఉద్యోగాలపై నిరుద్యోగులను మోసం చేశారు. కనీసం 2 ఉద్యోగాలు కూడా జాబ్ క్యాలెండర్‌లో చూపలేదు. ఇంత కంటే ముఖ్యమైన సబ్జెక్ట్ ఏముంటుంది? మాట్లాడేందుకు కనీసం 2 నిమిషాల సమయం ఇవ్వండి' అంటూ కేటీఆర్ పోడియం ముందుకు వెళ్లి అభ్యర్థించారు. మిగతా సభ్యులు కేటీఆర్‌ను అనుసరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేతులు జోడించి అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేసినా స్పీకర్ నిరాకరించారు. ఓవైపు బీఆర్ఎస్ సభ్యుల విజ్ఞప్తితో కూడిన నిరసన తెలుపుతుండగా స్పీకర్ పట్టించుకోకుండా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడేందుకు అనుమతించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. సర్కారు తీరుపై నిరసన తెలిపారు. 'నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసింది.. షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. మాట్లాడేందుకు స్పీకర్ ఎంతకూ అవకాశం ఇవ్వకపోవడంతో సభనుంచి బయటకు వచ్చారు.

దద్దరిల్లిన అసెంబ్లీ

జాబ్ క్యాలెండర్ విషయంలో సర్కారు తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వచ్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యేలు చేసిన నినాదాలతో అసెంబ్లీ ప్రాంగణం మార్మోగింది. 'బోగస్..బోగస్..జాబ్ క్యాలెండర్ బోగస్, నహీ చలేగా నహీ చలేగా..తానా షాహీ నహీ చెలేగా, మోసం మోసం..కాంగ్రెస్ మోసం' అంటూ కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నినాదాలతో అసెంబ్లీ ప్రాంగణం దద్దరిల్లింది.

అసెంబ్లీ లాబీ నుంచి బీఆర్ఎస్ నినాదాలు మిన్నంటడంతో మార్షల్స్ సహా భద్రతా సిబ్బంది, పోలీసులు వచ్చి అనుసరించారు. అసెంబ్లీ ప్రాంగణం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేస్తూ గన్‌పార్క్ దాకా ర్యాలీ తీశారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణం సహా బయట ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

సీఎం లేకుండానే ప్రకటన

జాబ్‌క్యాలెండర్‌పై సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన చేసిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి లేరు. ప్రకటన చేసిన మరుక్షణమే భట్టి కూడా బయటకు వెళ్లిపోవడంతో జాబ్‌క్యాలెండర్‌పై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని బీఆర్ఎస్ విమర్శించింది.

అమరవీరుల స్తూపం వద్ద బైఠాయింపు

కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం తీరు మారకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎంసీ కోటిరెడ్డి, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కేపీ వివేకానంద, కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, కోవ లక్ష్మి, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జాబ్‌క్యాలెండర్ ప్రకటన, సభలో ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది తెలంగాణ అసెంబ్లీకి చీకటి రోజుగా అభివర్ణించారు. శాసనసభ నుంచి దానంను బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత.. ఎమ్మెల్యేల తరలింపు

అసెంబ్లీలో ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు, అస్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదలను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేలతో పోలీసులు వాగ్వాదానికి దిగుతున్న సమయంలోనే అమరవీరుల స్తూపం చుట్టూ పోలీసులు వలయంగా ఏర్పడ్డారు. కేటీఆర్, హరీశ్‌రావు సహ ఒక్కొక్కరిని వాహనాల్లో లాక్కెళ్లారు. పోలీస్ బస్సుల్లో తెలంగాణ భవన్‌కు, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గన్‌పార్క్ పరిసర ప్రాంతాల్లోకి నిరుద్యోగులు రాకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ దారుణమైన పదజాలంతో దుర్మార్గంగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. జాబ్‌క్యాలెండర్‌పై స్పష్టత ఇవ్వాలని కోరడం తప్పా అని ప్రశించారు. బీఆర్ఎస్ నాయకులపై, మహిళా ఎమ్మెల్యేలపై అసభ్యపదజాలంతో మాట్లాడడం శోచనీయమని వాపోయారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేదాకా పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, అమీర్‌పేట ప్రాంతాల్లో తమ నిరసనలు కొనసాగుతాయని చెప్పారు.

రాహుల్.. అశోక్‌నగర్ వచ్చే దమ్ముందా?

మొదటిపేజీ తరువాయి...

ఆక్షేపించారు. జాబ్ క్యాలెండర్ నిజమైతే అందులో రెండు లక్షలు కాదు రెండు ఉద్యోగాలు కూడా ఎందుకు పెట్టలేదని నిలదీశారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అశోక్‌నగర్‌కు రావాలని, తామంతా అక్కడికి వస్తామని కేటీఆర్ వారికి సవాల్ విసిరారు. అశోక్‌నగర్‌లో విద్యార్థులకు ఒక్క ఉద్యోగం ఇచ్చినట్టు చెప్పినా తామంతా రాజీనామా చేస్తామని ప్రకటించారు. 'మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలని చెప్పుకొంటున్నరు.. మేమిచ్చిన 30 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ఇచ్చినట్టు చెప్పుకొంటున్నరు. రేవంత్ మాట మాట్లాడితే నువ్వు మొగోడివైతే అంటడు.. మరి ఆయన మొగోడైతే సిటీ సెంట్రల్ లైబ్రరీకి రావాలె' అని కేటీఆర్ సవాల్ చేశారు. 'అక్కడికి వస్తే విద్యార్థులే మిమ్మల్ని తన్నితరిమేస్తరు' అంటూ కాంగ్రెస్ నేతలనుద్దేశించి ధ్వజమెత్తారు. నిన్నరాత్రి జీవో 46 ను సవరించాలని దిల్‌సుఖ్‌నగర్‌లో అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారని, అటు బిల్లుల కోసం 1800 మంది సర్పంచ్‌లు సచివాలయాన్ని ముట్టడిస్తే వారిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. మార్పు, మార్పు అంటూ నిరుద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'ఈ రేవంత్ రెడ్డి ఎవరితో గోక్కోకూడదో వారితోనే గోక్కున్నారు.. కావాలనే నిరుద్యోగులను, యువతను రెచ్చగొట్టి ఓట్లేయించుకొని అధికారంలోకి వచ్చిండ్రు. జాబ్ క్యాలెండర్ బోగస్, అందులో తారీఖులు తప్ప ఏమీ లేవు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చించాలని అడిగితే స్పీకర్ తమకు రెండు నిమిషాల సమయం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రూప్ 1, 2, 3లో ఉద్యోగాల సంఖ్య పెంచుతామని హామీ ఇచ్చారని, గ్రూప్–1లో 1: 100 పిలవాలంటే తప్పించుకున్నారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చిద్దామంటే తమ పార్టీ నుంచి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేతో ఇష్టమొచ్చినట్టు తిట్టించారని మండిపడ్డారు. 'ఆ ఎమ్మెల్యే బజారు భాషలో మాట్లాడారు. కోవా లక్ష్మి అక్క ఆ భాష వినలేక మనం ఇక్కడ ఉండొద్దు.. వెళ్లిపోదామని కోరారు' అని ఆక్షేపించారు. తెలంగాణ యువత తరపున తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇంత బజారు భాషలో తమను తిట్టిస్తారా అని ప్రశ్నించారు. ఇంత దిగజారుడు, దివాళా కోరు ముఖ్యమంత్రిని ఎప్పుడు చూడలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వాళ్లను ఎక్కడికక్కడ నిలదీయాలని, ఈ శాడిస్ట్ ముఖ్యమంత్రి అందరినీ ఉసిగొల్పుతూ బజారు భాష మాట్లాడిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఇలాంటి శాడిస్ట్ పనులు ఎక్కువ కాలం నడవవని, ఈ ఐదారు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో ఏమీ జరగలేదని అర్థమైపోయిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఒక శాడిస్ట్ అని, తమ ఆడబిడ్డలను, తమ ఎమ్మెల్యేలను తిట్టిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఇవాళ తెలంగాణ శాసనసభకు చీకటిరోజు అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

హైదరాబాద్ విషయంలో సభలో తప్పుడు ప్రచారం చేశారని, రాష్ట్రం అప్పుల పాలైందని తప్పుడు కూతలు కూశారని, ఈ రాష్ట్రం సంపద గల రాష్ట్రమని తాము లెక్కలతో చెప్పే సరికి చేసేదేం లేక సైలెంటయ్యారని చెప్పారు. తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టించేలా రేవంత్‌రెడ్డి చిల్లర ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలను ఇకనైనా ప్రజలు అర్థం చేసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

సమాజం తలదించుకునేలా దానం భాష : సబితా ఇంద్రారెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ శాసనసభలో దానం నాగేందర్ మాట్లాడిన భాష సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సిటీ మీద చర్చ జరుగుతుంటే కాంగ్రెస్ ప్రాణాళిక ఏంటని తాము అడుగుదామనుకున్నామని చెప్పారు. స్పీకర్ తమకు చాలానీతులు చెప్పారని, దానం నాగేందర్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూస్తామని, దానంపై స్పీకర్ యాక్షన్ తీసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని రేవంత్‌రెడ్డి అన్నాడని, అసెంబ్లీ అంటే దేవాలయమని, అలాంటి దేవాలయంలో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని సబిత ఆవేదన వ్యక్తంచేశారు.

సభలో అవమానిస్తున్నరు : కోవ లక్ష్మి

ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ శాసనసభలో రెండు రోజుల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అవమానించేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, నిన్న మహిళలను అవమానించారని, ఈరోజు దానం నాగేందర్ అసభ్యకరంగా మాట్లాడారని చెప్పారు. రూ.25 కోట్లతో కేసీఆర్ జోడేఘాట్‌ను అభివృద్ధి చేసి చూపించారని, మెడికల్ కాలేజీలు పెట్టారని, జోడేఘాట్ గురించి అవగాహన లేకుండా ఎడ్మ బొజ్జు మాట్లాడుతున్నారని, నాలుగు లక్షల ఎకరాలకు పైగా అటవీ భూములకు బీఆర్ఎస్ పట్టాలు ఇచ్చిందని గుర్తుచేశారు. 'ఒక్క కేసీఆర్ కే ఫాంహౌస్ ఉన్నదా? కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఫాంహౌస్‌లు లేవా?' అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ పెద్ద బోగస్ అని విమర్శించారు. దానం నాగేందర్‌కు సిగ్గూశరం ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన కాంగ్రెస్, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, ఉద్యోగాలను కాంగ్రెస్ వచ్చాక తన ఖాతాలో వేసుకున్నదని చెప్పారు. కొంతమంది కుహనా మేధావులు నిరుద్యోగులను రెచ్చగొట్టారని తెలిపారు. గ్రూప్–1 మెయిన్స్‌లో 1:100 చొప్పున అభ్యర్థులను పిలవాలని అడిగితే 1:50కు నోటిఫికేషన్ ఇచ్చారని, గ్రూప్స్‌లో ఒక్క పోస్టు కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోస్టులు పెంచాలని అడిగిన నిరుద్యోగులపై లాఠీచార్జీ చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అర్ధరాత్రి ఎజెండా ఇస్తరా?

- సభ్యులు ఎప్పుడు ప్రిపేరవుతరు?
- ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ
- మాకు ఎజెండానే రావడం లేదు: సీపీఐ
- కొత్త సభ్యులున్నారు.. సమయమివ్వండి: బీజేపీ

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎజెండాను అర్ధరాత్రి ఇచ్చారని ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశాయి. ఇచ్చిన ఎజెండా ఒకటైతే సభలో మరోటి చర్చకు పెడుతున్నారని ఆక్షేపించాయి. శుక్రవారం ఉదయం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే, తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు, ఆ తర్వాత తెలంగాణ శాసనాల బిల్లు (సంక్షిప్త పదాల మార్పు), తెలంగాణ పబ్లిక్ సర్వీసు నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది తీరు, వేతన రేషనలైజేషన్ సవరణ బిల్లులను సభ ఆమోదానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. దీనిపై విపక్ష సభ్యుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఎంఐఎం శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ మాట్లాడుతూ రాత్రి 1.40 గంటలకు తనకు ఎజెండా అందిందని, సభ్యులు ఎప్పుడు ప్రిపేరవుతారని ప్రశ్నించారు. బిల్లులపై సభ్యులు అభిప్రాయాలను ఎలా చెప్తారని ప్రశ్నించారు. ఎజెండాను ముందుగా పంపాలని ప్రతిసారి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక బిల్లు చర్చకు పెట్టి వేరే అంశాలపై చర్చిస్తున్నారని, ఇలాంటిది తన 25ఏండ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని వాపోయారు. మిత్రపక్షంగా స్పందించకపోతే ఎలా? అంటూ సీపీఐ ఎమ్మెల్యేను అక్బరుద్దీన్ కోరారు. 'మీకు ఎజెండా అయినా వస్తున్నది. మాకు అది కూడా రావడం లేదు' అంటూ కూనంనేని బదులిచ్చారు. ఇదే విషయమై బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ మండిపడ్డారు. ఒకే రోజు బిల్లులను ప్రవేశపెట్టడం, అభిప్రాయాలు తీసుకోవడం, ఆమోదించడం తగదని చెప్పారు. ఎజెండాను ముందుగా ఇవ్వాలని, బిల్లులపై చర్చించేందుకు అవకాశమివ్వాలని సూచించారు. ఎంఐఎం, సీపీఐ, బీజేపీ సభ్యుల వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు సైతం మద్దతు పలికారు. ప్రభుత్వ చర్యను మాత్రం మంత్రి దుద్దిళ్ల సమర్థించారు. ప్రాధాన్యం లేని అంశాలున్నప్పుడే ఇలా జరుగుతున్నదని చెప్పారు.

త్వరలో డిజిటల్ యూనివర్సిటీ

- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
- శాసనమండలి సమావేశాలు నిరవధిక వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలో డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లుపై శాసనమండలిలో సభ్యులు చర్చించిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు వివరణ ఇచ్చారు. యువత నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు వారిని ఆంత్రపెన్యూర్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీలో 7వ తరగతి నుంచే అడ్మిషన్లు చేపడుతామని, షార్ట్ టర్మ్ కోర్సుల కింద 30 నుంచి 45 రోజులు యువతకు శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. స్కిల్స్‌లో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులతో సిలబస్‌ను రూపొందిస్తామని తెలిపారు. కులవృత్తులు, గ్రామీణ ప్రాంతాలవారికి అధిక ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత సాంకేతిక కోర్సులను ప్రవేశ పెడుతామని చెప్పారు. సెప్టెంబర్ నుంచే కార్యాచరణ ఉంటుందని తెలిపారు. 60 శాతం బోధన సిబ్బందిని వివిధ పరిశ్రమల నుంచి ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. బోధనలో థియరీ, ప్రాక్టికల్స్ మధ్య ఉన్న తేడా తగ్గిస్తామని, అందుకోసం ఇంటర్న్‌షిప్‌లకు ఆహ్వానిస్తామని వివరించారు. యూనివర్సిటీ శిక్షణ సంస్థలను జిల్లాలకూ విస్తరిస్తామని, నిధుల సమీకరణకు 'సెల్ఫ్ ఫైనాన్స్' కోర్సులను రూపొందిస్తామని చెప్పారు. రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సిలబస్, కోర్సులు, అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోదని, సాఫ్ట్ స్కిల్స్ పై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో (ఏఐ)తో శాసనమండలిని అనుసంధానిస్తామని చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో నాలుగు బిల్లులకు ఆమోదం లభించిందని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. మండలి సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసినట్టు చైర్మన్ ప్రకటించారు.

జాబ్ క్యాలెండర్.. జోక్ క్యాలెండర్

- విద్యార్థులకు దగా.. నిరుద్యోగులకు ధోకా .. ఇది అసెంబ్లీ చరిత్రలోనే బ్లాక్ డే
- మోసం చేసినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి
- రాహుల్ స్పందించకుంటే ఢిల్లీకి వెళ్లి నిలదీస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిరుద్యోగులతో కలిసి మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల కోసం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది జాబ్ క్యాలెండర్ కాదని, అదొక జోక్ క్యాలెండర్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో నిరుద్యోగులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. నిరుద్యోగులు తమకు జరిగి అన్యాయాన్ని వివరించడానికి అశోక్‌నగర్ నుంచి బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో నిరుద్యోగులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌లో ఏమైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీ ప్రకారం 2 లక్షల ఉద్యోగాల భర్తీకి ఇంకా 4 నెలల సమయమే ఉన్నదని, ఏదీ తమరు చెప్పిన జాబ్ క్యాలెండర్ అని నిలదీశారు. అసెంబ్లీలో స్టేట్‌మెంట్ ఇస్తే, ఆ స్టేట్‌మెంట్ ఎవరు ఇచ్చారనేది ఉంటుందని, కానీ జాబ్ క్యాలెండర్ ప్రకటించిన వారి పేరు, సంతకం లేదని దుయ్యబట్టారు. అదొక చిత్తు కాగితం లాగా ప్రకటించారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

చర్చ పెట్టాలంటే పారిపోయిన డిప్యూటీ సీఎం

జ్యాబ్ క్యాలెండర్‌పై ఎలాంటి చర్చ లేకుండా డిప్యూటీ సీఎం చదివి పారిపోయారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. లక్షలాది యువత కంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? అని ప్రశ్నించారు. చర్చ చేయమంటే ఎందుకు పారిపోయారు? అని నిలదీశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చించమంటే ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు మైక్ ఇచ్చి మాట్లాడే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వాన్ని వదిలి పెట్టబోమని, నిరుద్యోగుల తరుపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు లేవు, నిరుద్యోగ భృతి లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే, ఉద్యోగాలు ఇచ్చిన మాట నిజమే అయితే, గన్‌మెన్ లేకుండా అశోక్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని సవాలు చేశారు. సీఎం చెప్పిన తేదీ, సమయానికి తాను కూడా వస్తానని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఒక్క నోటిఫికేషన్ ఇచ్చారా? దమ్ముంటే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా ఎన్ని రోజులు దాక్కుంటారు? ఎన్ని రోజులు తప్పించుకుంటారు? అని ఎద్దేవా చేశారు. యువతకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. 'రాహుల్‌గాంధీ.. నీ క్రెడిబులిటీ ఏమిటి? తమరు వచ్చి సమాధానం చెప్పాలి, లేకుంటే నిరుద్యోగ యువతతో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయానికి వస్తాం, అక్కడే నిలదీస్తాం' అని హరీశ్‌రావు హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగ యువతను కాంగ్రెస్ సర్కారు దగా చేసిందని, శాసనసభ చరిత్రలో ఈ రోజు (శుక్రవారం) బ్లాక్ డే అని పేర్కొన్నారు.

దానం సభ్యత్వం రద్దు చేయాలి

అసెంబ్లీలో దానం నాగేందర్ మాట్లాడిన భాష రౌడీ షీటర్ భాషలా ఉన్నదని, ఆయన సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దానం వ్యాఖ్యలు కన్నతల్లులను అవమానపరిచేవిధంగా ఉన్నాయని, మాతృత్వం విలువ తెలియని వారు మాత్రమే ఇలా మాట్లాడుతారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా దానం ఇలానే మాట్లాడరని గుర్తుచేశారు. దానం నాగేందర్ వెంటనే క్షమాపణ చెప్పాలని అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారని, అందుకు అక్బరుద్దీన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ఏమైనా దానం నాగేందర్ జాగీరా? అని ప్రశ్నించారు. రాష్ట్ర శాసనసభ దుశ్శాసన సభగా మారిందని మండిపడ్డారు. మహిళ ఎమ్మెల్యేలను అవమానపరిచారని, సభా నాయకుడే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే మహిళలకు దక్కే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు.

జ్యాబ్ క్యాలెండర్ లోపభూయిష్టం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ లోపభూయిష్టంగా ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. పోస్టులు ప్రకటించకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం బాధాకరం. జాబ్ క్యాలెండర్‌లో కనీసం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంతకం కూడా లేదు. దీనికి ఎలాంటి చట్టబద్ధత కల్పించారు? ఎన్నికల ప్రచారంలో మమ్మల్ని వాడుకుని వదిలేయడం ఎంతవరకు సమంజసం? మా ఆశలు అడియాసలు అయ్యాయి. –మహేందర్, నిరుద్యోగి

చిత్తశుద్ధి లేని జాబ్ క్యాలెండర్

నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జాబ్ క్యాలెండర్ ఇలా ఉండేది కాదు. క్యాలెండర్‌లో నోటిఫికేషన్ పేరు, నెల మాత్రమే ప్రకటించారు. పోస్టుల సంఖ్య చెప్పలేదు. జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చకు ఎందుకు పెట్టలేదు. ఈ జాబ్ క్యాలెండర్‌ను నమ్మే పరిస్థితి లేదు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలి. –సింధూరెడ్డి, నిరుద్యోగి

అసెంబ్లీ నిరవధిక వాయిదా

- 9 రోజుల పాటు సాగిన సమావేశాలు
- ఐదు బిల్లులకు ఉభయ సభల ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభను శుక్రవారం రాత్రి నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు జూలై 23న ప్రారంభమయ్యాయి. 25న బడ్జెట్ ప్రవేశపెట్టారు. శాసనసభ మొత్తం 9 రోజులు.. 65.33 గంటల పాటు నిర్వహించారు. రెండు అంశాలపై లఘు చర్చ నిర్వహించగా ఐదు బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించారు. ప్రభుత్వం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఒక అంశంపై మంత్రి ప్రకటన చేశారు. 32 ప్రశ్నలకు సభలో, 8 ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. శాసనసభలో మంత్రులు 23.47 గంటల పాటు ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి 4.54 గంటలు, కాంగ్రెస్ సభ్యులు 12.45 గంటలు, బీఆర్ఎస్ సభ్యులు 12.57 గంటల పాటు మాట్లాడారు. బీజేపీ సభ్యులు 5.55 గంటలు, ఎంఐఎం సభ్యులు 7.34 గంటలు, సీపీఐ సభ్యుడు 2.35 గంటల పాటు ప్రసంగించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పద్దులను గిలిటెన్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. పద్దులపై చర్చించడానికి కేవలం 2 రోజులే కేటాయించటంతో ప్రతిపక్ష సభ్యులు పూర్తిగా మాట్లాడకుండా, మంత్రులు సమాధానం ఇవ్వకుండానే గిలిటెన్ చేశారు. ప్రతిపక్ష సభ్యులను అధికార పార్టీ సభ్యులు, మంత్రులు పదే పదే లక్ష్యంగా చేసుకొని సభను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. ప్రధాన అంశాలను చర్చించకుండానే సభను నిరవధికంగా వాయిదా వేశారని ఆరోపించారు. సభను కనీసం 15 రోజులు నిర్వహించాలని బీఆర్ఎస్ సహ బీజేపీ డిమాండ్ చేశాయి. 9 రోజుల పాటే సభను నిర్వహించి వాయిదా వేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రైతులు, నిరుద్యోగుల సమస్యలపై చర్చ జరగకుండానే వాయిదా వేశారని విమర్శిస్తున్నారు. రైతు భరోసా, రుణ మాఫీ, ఉద్యోగాల భర్తీ తదితర అంశాలపై చర్చించకుండానే వాయిదా వేశారని విమర్శిస్తున్నారు. అటు.. శాసనమండలి కూడా నిరవధికంగా వాయిదాపడింది. ఈ మేరకు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. మండలి జూలై 24న ప్రారంభమైంది. ఆరు రోజులు .. 20 గంటల పాటు సభ జరిగింది. ఐదు బిల్లులను మండలి ఆమోదించింది. 45 మంది

సభ్యులు మాట్లాడారు. 9 ప్రశ్నలకు సభలో, 5 ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రులు 5.30 గంటలు, కాంగ్రెస్ సభ్యులు 3.37 గంటలు, బీఆర్ఎస్ 6.24 గంటలు, బీజేపీ 43 నిమిషాలు, ఎంఐఎం సభ్యులు 38 నిమిషాలు మాట్లాడారు.